

# ధర్మగుప్తుడు

శంకరానందులవారి ఆశ్రమానికి ప్రతి రోజూ ఉదయం ఆవుపాలను ఉచితంగా పంపేవాడు వీరయ్య అనే రైతు. అయితే ఆరోజు ఎంతకూ పాలను పంపక పోవటంవల్ల శివానందుడనే శిష్యుడ్ని పిలిచి కారణం అడిగాడు గురువు.

"ధనగుప్తుడి దుకాణాన్నుండి తెచ్చిన కల్తీ ఆముదాన్ని త్రాగించటంవల్ల వీరయ్య ఒక్కగాని ఒక్క కొడుకు చనిపోయాడట స్వామీ! ఆ విచారంతో వున్న వీరయ్య బహుశా మన ఆశ్రమానికి పాలు పంపించలేకపోయి వుంటాడు," అన్నాడు జవాబుగా శిష్యుడు.

"మరి దుకాణాల్లో కల్తీ సరుకులు అమ్ముతుంటే అధికారులు ఏం చేస్తున్నట్లు?" అనడిగారు శివానందులు.

"అది ఒక విషవలయం స్వామీ! ధనగుప్తుడు తన ధనాన్ని అధికార్లకు లంచంగా ఇచ్చి, వారిని కొనేశాడు. అందువల్ల అతడు ఎన్ని అక్రమాల్ని చేస్తున్నా ఎవరూ ఆపలేకపోతున్నారు. పైగా అతను గుప్త వ్యాపారి. చిన్న వర్తకులందరు అతని ఆజ్ఞను సుగ్రీవాజ్ఞగా స్వీకరిస్తున్నారు. అందువల్లనే నగర వ్యాపారమంతా ధనగుప్తుడి గుప్పెట్లో ఇరుక్కుపోయింది. పౌరులకు అధిక ధరలు-కల్తీ సరుకులు మిగిలిపోయాయి." అంటూ వివరించాడు శిష్యుడు.

"మరి అధికార్లు తమ అధికారాల్ని దుర్వినియోగం చేస్తుంటే మహామంత్రుల వారు ఏం చేస్తున్నట్లు?" అనడిగాడు గురువు.

"మహామంత్రుల వారికి అధికార్లు తాము అందుకున్న లంచాల మొత్తాన్నుండి ఆయన వాటాని ఆయనకు పంపుతున్నారు. ప్రజల గోడు పట్టించుకునే నాధుడే కరువయ్యాడు," అని చెప్పాడు శిష్యుడు సవినయంగా.

"నువ్వు చెప్పేది వింటుంటే చాలా ఆశ్చ



ర్యంగా వుంది ప్రజల్లో అసంతృప్తి పేరుకుపోతే విప్లవం బయలుదేరుతుంది. దేశ భద్రతకే ముప్పు వస్తుంది.'' అంటూ వాపోయాడు శంకరానంద స్వామి.

"స్వామీ! తమ మాట ప్రభువులకు వేదం కదా! ధనగుప్తుడి సంగతి చెప్పి, అక్రమాలను అరికట్టించ కూడదూ!'' అనడిగాడు శివానందుడు

"అందువల్ల ప్రయోజనం వుండదు శివానందా! దొంగల్ని పట్టి శిక్షించినంత మాత్రాన దొంగతనాలు ఆగవు నేరస్థుల్ని దండించినంత మాత్రాన నేరాలు ఆగవు.'' అన్నాడు గురువు.

"అదేమిటి స్వామీ!''

"అవును. దొంగను శిక్షించటం జరిగిందనుకో. ఆ శిక్ష పూర్తయిన తర్వాత తిరిగి వచ్చి అతడు తిరిగి చేసేది దొంగతనమేగా?''

"మరి ఈ సమస్యకు పరిష్కారంలేదా''

"ఎందుకు లేదు. వున్నది మనిషిలో వున్న నేరం చేసే తత్వాన్ని రూపుమాపాలి. అంటే తప్పు చేస్తున్నవాడు తన తప్పును తానే దిద్దుకొనేటట్లు చేయాలి''

"అదెలా స్వామీ?''

"కొంచెం ఓపికపట్టు. నీకే తెలుస్తుంది'' అంటూ ఆ సంభాషణను అంతటితో ఆపివేశాడు గురువు.

కొంతకాలం గడిచింది.

ఒకనాడు ధనగుప్తుడు తన మనుమరాలి పుట్టినరోజు పండుగను బ్రహ్మాండంగా జరిపించి, ఆ సందర్భంగా శంకరానంద స్వాములవారికి ప్రత్యేక ఆతిథ్యం ఇచ్చాడు.

విందు ముగిసిన తర్వాత స్వాములవారు ధనగుప్తుడి భవనంలోనే విశ్రమించాడు.

తెల్లవారుఝామున అందరి కంటే ముందుగా లేచిన స్వాములవారు ఉయ్యాలలో పడుకుని నిద్ర పోతున్న ధనగుప్తుడి ఏడాది నిండిన మనుమరాల్ని భుజాన వేసుకుని, ఎవరికీ తెలియకుండా వెళ్ళి పోయాడు.

తెల్లవారింది.

పాప కనుపించకపోవటం, స్వాములవారూ కనుపించకపోవటంతో ధనగుప్తుడు అనుమానం తోను, ఆగ్రహంతోను కొత్వాలుకు ఫిర్యాదు చేశాడు.

వెంటనే కొత్వాలు నగరం నాలుగు వైపులా పాప కోసం వెతకమని రక్షక భటుల్ని పంపాడు వారు నగరం దాటి తన ఆశ్రమాన్ని సమీపిస్తున్న స్వాములవార్ని పట్టి బంధించారు. పాపను తమ స్వాధీనం చేసుకున్నారు.

ఆ తర్వాత శంకరానంద స్వాములవార్ని మహారాజు ఎదుట హాజరుపరచారు.

మహారాజు విజయవర్మ స్వామి వంక చూస్తూ "స్వామీ! మీరీ పనిని చేశారంటే విశ్వసించలేక పోతున్నాను. మీరు కోరితే కోరినన్ని మరకత మాణిక్యాల్నీ. వజ్రవైఢూర్యాల్ని రాసులు పోసి వుండేవాడ్ని కదా! బిడ్డ వంటిమీద వున్న నగల కోసమే మీరీ పని చేశారా?" అనడిగాడు.

సర్వసంగ పరిత్యాగి, మహానుభావుడు అని పేరొందిన వ్యక్తి నగల కోసం పసికందును ఎత్తుకు పోవడం విన్న ప్రజలు విస్మయం చెందారు. అందు వల్ల స్వామి జవాబు కోసం ఆతృతగా చూడ సాగారు.



నాపై మోపిన అభియోగం నిజమే స్వామి! నేను నగల కోసమే ఈ దారుణం చేశాను. మరి కొంచెం ఆలస్యమైతే బిడ్డ ప్రాణాల్ని కూడా తీసి వుండే వాడినేమో, భటులు సమయానికి వచ్చి నన్ను బంధించారు," అని చెప్పిన స్వామి జవాబును విని రాజుతో పాటు అందరు నివ్వెర పోయారు.

"తప్పును అంగీకరిస్తున్నారా స్వామీ! ఎంత కఠినశిక్ష విధించబడుతుందో తెలుసా?" అనడి గాడు మహారాజు.

"తెలుసు ప్రభూ! నా తప్పు ఎంత దారుణమైన దైనా మీరు విధించే శిక్షను మాత్రం ధనగుప్తుడే అనుభవించవలసి వుంటుంది," అన్నాడు స్వామి.

మహారాజు ఒక్క క్షణం ఆలోచించి, ఏదో అంతరార్థం లేనిదే స్వామి అలా సెలవీయడని గ్రహించి, ఆ 'ధర్మసూక్ష్మం' ఏమిటో చెప్పమని స్వామినే అడిగాడు.

"మహారాజా! నాకు దొంగతనం చేయాలన్న బుద్ధి ఎలా పుట్టిందో వినండి" అంటూ ముందు వీరయ్య కుమారుడి చావుని గురించీ, ధనగుప్తుడి లంచగొండితనాన్ని గురించీ వివరించాడు.

ఆ తర్వాత "ధనగుప్తుడు అమానుషంగా ఆర్జన చేస్తున్నాడు. అధికార్లు లంచాలు అందుకుని ఊరుకుంటున్నారు. మహామంత్రుల వారూ అంతే! ప్రజలు తమ గోడు చెప్పుకోవటానికి కూడా అధికార యంత్రాంగం మధ్యలో అడ్డుకుంటున్నది ప్రభూ!.... ధనగుప్తుడి ఇంట్లో ఒక్కపూట ఆరగించినందు వల్లనే నాలో ఎన్నడూ లేని పాపపు తలంపులు ఏర్పడ్డాయి. నగల మీద వ్యామోహం కలిగింది. ఆఖరికి పసికందు అసువుల్నే బలికొనే వాడినేమో! కాబట్టి తప్పు నాది కాదు. పాపపు తిండి పెట్టిన ధనగుప్తుడిది. అతడినే మీరు శిక్షించాలి...." అంటూ ముగించాడు స్వామి.

ధనగుప్తుడు, "నన్ను మన్నించండి స్వామీ!" అంటూ శంకరానందులవారి కాళ్ళకు చుట్టుకుపోయాడు.

స్వామి అతన్ని లేవనెత్తి, "ధనగుప్తా! ఒక్క పూట నీ తిండితోనే నేను దుర్మార్గుడినైనానే! రోజూ నీ అక్రమ ఆర్జన తింటున్న నీ భార్య బిడ్డలు ఎంత అధ్వాన్న స్థితికి దిగజారగలరో నువ్వు ఆలోచించావా? నీ వంశమే నరక కూపంలో కూరుకుపోయే దుస్థితి నుండి బయటపడు," అని ఆదేశించాడు.

స్వామి ధర్మసూక్ష్మాన్ని విని నాటినుండి ధర్మంగా వ్యాపారం చేస్తూ, ధనగుప్తుడు ధర్మగుప్తుడుగా కీర్తిగాంచాడు.



